క్లుప్తంగా

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటమి తప్పదు


ఎం. సూర్యనారాయణ

దెందులూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను సమన్వయం చేసి ప్రణాళికాబద్ధంగా అన్ని పరిస్థితులను వివరించి రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కూటమి అభ్యర్థిని ఓడించేందుకు కృషి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఎం సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులైన అధిక శాతం ఓట్లు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఐక్యత లేక పోవడం విజయం సాధించలేకపోవడానికి ప్రధాన కారణమన్నారు. విద్యావంతులైన పట్టభద్రులు భవిష్యత్తు భద్రత అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తూ సమష్టిగా కూటమి అభ్యర్థిని ఓడించాలన్నారు. పూర్వ విద్యార్థులు 4 వేల మందితో పట్టభద్రుల వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేశానన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న పట్టభద్రులను సైతం అధికంగా ఓటర్లుగా చేర్పించేందుకు అందరితో కలిసి కృషి చేస్తున్నామన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు


జల్లికొమ్మర స్కూల్లో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గణపవరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జల్లికొమ్మర గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చేశారని సోషల్ టీచర్ ప్రసాదరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలి


గణపవరం హౌసింగ్ కాలనీని సందర్శించిన డీఈఈ, ఎంపీడీవో తదితరులు

గణపవరం: గణపవరంలోని హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయడానికి అధికారులు లబ్ధిదారులను చైతన్య పర్చాలని తాడేపల్లిగూడెం డివిజన్ హౌసింగ్ డీఈఈ ప్రసాద్ అన్నారు. గణపవరంలోని కాలనీని డీఈఈతోపాటు ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఇతర అధికారులు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని, స్థలం పొందిన వారు ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. కాలనీలోని అంతర్గత రహదారులు, ఇతర వసతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు


గణపవరం కాలేజీలో రక్త పరీక్షల ప్రాధాన్యతను వివరిస్తున్న వైద్యాధికారి సంతోష్

గణపవరం: విద్యార్థులు రక్తహీనత కారణంగా ఆరోగ్య సమస్యలతో పాటు, చదువులో వెనుకబడి పోతారని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు రక్తపరీక్షలు, బ్లడ్ గ్రూపు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రక్తహీనత లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆహారంలో ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవాలని, ఐరన్ మాత్రలను వాడాలని సూచించారు. తక్కువ హిమోగ్లోబిన్ ఉన్న వారికి పీహెచ్‌సీ నుంచి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పీహెచ్‌సీ సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు.

ఓటు నమోదు చేసుకోండి

ఉంగుటూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు ఇంకా ఐదు రోజులే గడువు ఉందని, ఉంగుటూరు తహసీల్దారు పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. ఈనెల 6వ తేదీతో గడువు ముగియనుందని ఆయన శుక్రవారం తెలిపారు. ఏదైనా డిగ్రీ చదువుకున్న వారు ఆ విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఉత్తీర్ణత ధ్రువపత్రాల జెరాక్స్‌లపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి, ఆధార్ కార్డు కాపీలు అందజేసి ఓటరుగా చేరవచ్చునని తెలిపారు.ఇప్పటికే చాలా మంది ఆఫ్‌లైన్, ఆన్‌లైను ద్వారా దరకాస్తులు అందజేశారని తహసీల్దారు వివరించారు.

శిథిలావస్థలో ఉపాధి హామీ భవనం

- జిక్కుజిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది
- ఏ క్షణంలో కూలుతుందోనన్న భయం
- వేరే భవనంలోకి మార్చాలని అభ్యర్థన


భీమడోలు ఉపాధి హామీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు


పెచ్చులూడుతున్న శ్లాబ్


శిథిలావస్థకు చేరిన ఉపాధి హామీ భవనం

భీమడోలు: ఏన్నో శాశ్వత భవన నిర్మాణానికి నిధులిచ్చి, ఉపాధి కార్మికుల జీవితాల్లో వెలుగు నింపే ఉపాధి హామీ మండల కార్యాలయానికి శాశ్వత భవనం కరువైంది. అందరికీ పని కల్పించే ఉపాధి హామీ సిబ్బందికి శాశ్వత భవనం లేక ఓ శిథిలావస్థకు చేరిన తాత్కాలిక భవనంలో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

శ్లాబ్ నుంచి పెచ్చులూడుతున్న వైనం

వర్షం వస్తే పెచ్చులూడిన శ్లాబ్ నుంచి నీరు లీకు కావడంతో విలువైన రికార్డులు, రిజిస్టర్లు తడిసిపోతున్నాయి. కంప్యూటర్లు తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయి. కార్యాలయ ఆవరణలో విష సర్పాలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలోని భవనంలో జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే అప్పటికే ఈ భవనం శిథిలావస్థకు చేరింది. అయితే కాలక్రమేణా మరింత అధ్వాన స్థితికి చేరుకుంది. పల్లపు ప్రాంతంలో కార్యాలయం ఉండడం వల్ల భారీ వర్షం వస్తే ఈ భవనంలోకి నీరు చేరుతోంది. దీనితో వర్షాకాలంలో ఉద్యోగులు, సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో 15,323 జాబ్ కార్డులుండగా 27వేల మంది ఉపాధి కార్మికులకు ఈ కార్యాయం నుంచి ఉపాధి పనులు కల్పిస్తారు. దీనితో ఏటా కార్మికులకు వేతనాలు, భవనాల నిర్మాణాలకు మెటీరియల్ కంపొనెంట్‌గా రూ.28 కోట్ల వరకు లబ్ధి చేకూర్చుతుంది. ఉపాధి హామీ నిధులతో పలు చోట్ల కార్యాలయాలు నిర్మించారు. ఉపాధి కార్మికులకు వంద రోజులు పని కల్పించాలన్న ఏకైక లక్ష్యంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయం కంప్యూటర్ సిబ్బంది, అధికారి భీమడోలులోని శిథిల భవనంలో సమీక్షలు చేస్తుంటారు. వారంతా రోజూ భయంతో విధులను నిర్వర్తిస్తున్నారు. ఉపాధి హామీ కార్మికులకు చెందిన ఈ భవనంపై ఉన్నతాధికారులు చిన్నచూపుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగేంత వరకు చూడకుండా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు చేసుకోవాలని, కూలే భవనం నుంచి ఖాళీ చేయించి వేరే శాశ్వత భవనంలోకి మార్చాలని ఉపాధి హామీ కార్మికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి భవనం సమస్య

భీమడోలు ఎంపీడీవో ప్రాంగణంలో ఉపాధి హామీ పథకం భవనం శిథిలావస్థకు చేరింది. విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఇబ్బందిగా ఉందన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని డ్వామా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాను.

– సీహెచ్ పద్మావతిదేవి, ఎంపీడీవో, భీమడోలు

దేశ ఐక్యతకు సర్దార్ పటేల్ కృషి


గణపవరంలో ఐక్యతా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

గణపవరం: భారతదేశంలోని అన్ని సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసి దేశాన్ని ఐక్యం చేసిన మహానుభావుడు సర్దార్ పటేల్ అని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి అన్నారు. సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ గల సంస్థానాలను ఆయన భారత్‌లో విలీనం చేయడం మామూలు విషయం కాదన్నారు. విద్యార్థి దశ నుంచే అందరూ ఐక్యతా భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్దార్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గ్రామంలో ఐక్యతా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, ఎన్ఎస్ఎస్ పీవోలు వెంకటరమణ, భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం


రామసింగవరంలో ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెదవేగి : వాతావరణ మార్పులతోపాటు వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జే గోవిందరావు సూచించారు. స్థానిక పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామసింగవరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి సూచన మేరకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభమగుతున్న సమయంలో కొన్ని సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ముఖ్యంగా చలి వాతావరణం వల్ల దగ్గు, జలుబు, ఆయాసం, ఎలర్జీ, వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఆయన అన్నారు. శీతాకాలంలో వేడి ఆహార పదార్థాలు భుజించాలని, గోరువెచ్చని నీరు తాగాలని, చలి తగలకుండా ఉన్ని దుస్తులు వాడాలని, దోమల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలని కోరారు. హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో 13 రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 63 రకాల పరీక్షలు ఉచిత నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రోజ్ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఎం.యల్.హెచ్.పి శశికుమార్, ఆరోగ్య కార్యకర్త నాగమణి, మేక శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు మౌనిక కనకదుర్గ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్


గొల్లగూడెంలో సర్వర్ సిగ్నల్ కోసం పడిగాపులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 11,500 పింఛన్లలో 10,651 పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశామని ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. 92.62 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు. మండలంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి కూడా శనివారం పింఛన్లు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. పింఛన్ల పంపిణీ సమయంలో మధ్యాహ్నం వరకు సర్వరు సరిగా పనిచేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూశారు. సాయంత్రం సర్వరు పని చేయడంతో పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది.

ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించాలి


పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు

పెదపాడు: ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించి అనంతరం ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరు, పాతముప్పర్రు, వీరమ్మకుంట, సత్యవోలు, వసంతవాడ, పెదపాడు గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆయన ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి సవరించడంతో పాటు ఇంగ్లీషు మీడియంకు సమాంతరంగా తెలుగు మీడియం బోధన ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు చట్టాన్ని రూపొందించాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ సరండర్ లీవ్ నగదు చెల్లింపులు, పీఆర్‌సీ సంబంధించి మధ్యంతర భృతి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల హెల్త్‌కార్డు నిరుపయోగంగా ఉందని, అమలులో లోపాలను తక్షణం సవరించి అన్ని వ్యాధులకు రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో వైద్యం ఉచితంగా అందేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. ఒకే సర్వరుపై అన్ని యాప్‌లు కొనసాగడంతో సాంకేతిక లోపాలు ఏర్పడి ఉపాధ్యాయ హాజరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల అధ్యక్షుడు ఐ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముర్తులీన్, మహిళా కార్యదర్శులు ఈ శశిరేఖ సంధ్యారాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రామశింగవరం నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీడీని అభినందిస్తున్న హెచ్ఎం

పెదవేగి : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని రామశింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం టీపీ పద్మావతి అన్నారు. శుక్రవారం పాఠశాల్లో నిర్వహించిన సన్మాన సభలో ఆమె మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో తణుకు (తేతలి)లో నిర్వహించిన అండర్ 14,17 – బాలుర క్రికెట్ సెలెక్షన్‌లో పెదవేగి మండలం రామశింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 14 విభాగంలో టి. దిలీప్, అండర్ 17 విభాగంలో పి.వంశీసాయి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు టీపీ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన సభలో పాఠశాల పీడీ జమ్మ రామకృష్ణ, విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఆనందోత్సాహాలతో దీపావళి

పెదవేగి : తెలుగు లోగిళ్లల్లో దీపావళి సందర్భంగా గురువారం దీపాల కాంతులు, బాణసంచా మెరుపులు మిన్నంటాయి. వాడవాడలా దీపావళిని పురస్కరించుకుని యువత, గృహిణులు ప్రమిదలు వెలిగిస్తూ సంప్రదాయ వస్త్రధారణలతో పూజలు చేశారు. అనంతరం యువత, చిన్నారులు కేరింతలు కొడుతూ బాణ సంచా కాలుస్తూ సందడి చేశారు. భారీస్థాయిలో పెరిగిన బాణసంచా ధరలను సైతం లెక్కచేయకుండా ప్రజలు బాణసంచా కాల్చి దీపావళిని ఆనందంగా జరుపుకున్నారు.

క్రీడాపోటీల్లో ఉపాధ్యాయుల ప్రతిభ


పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులు

దెందులూరు: గత నెల 29, 30 తేదీల్లో జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆల్ ఇండియా ప్రభుత్వ ఉద్యోగుల ఆటల పోటీలు నిర్వహించినట్టు కొవ్వలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీఎస్ఎల్ఎస్‌వీ శర్మ అన్నారు. శుక్రవారం పాఠశాలలో విజేతలకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో పోతునూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం షేక్ హసీన్‌వలీ చెస్, క్యారమ్, మ్యూజిక్ పోటీల్లో, ఎ స్వీకేడీ నాగరాజు షార్ట్‌పుట్, డిస్కస్ త్రో, టేబుల్ టెన్నిస్ పోటీల్లో గెలుపొందారన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు ఎం. కృష్ణారావు లాంగ్ జంప్, ఖోఖో, రెజ్లింగ్, జి.శ్రీనివాసరావు షార్ట్‌పుట్ పోటీల్లో గెలుపొందారన్నారు. విజయవాడలోని నవంబరు మొదటివారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల ఆటల పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలను ఎంఈఓలు ఏపీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ, ఐపీఎం మనోహర్, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్తీక మాసోత్సవాలకు శివాలయాలు ముస్తాబు


పోలసానిపల్లి శివాలయంలో విద్యుద్దీపాలంకరణ


భీమడోలులో దేవస్థానం, దాతల నిధులతో ముస్తాబైన ఆలయం


పోలసానిపల్లిలో ఆకాశ దీపం ఏర్పాటు

- నేటి నుంచి ఆలయాల్లో కార్తీక పూజలు
- ఆలయాల్లో దీపోత్సవానికి ఏర్పాట్లు


విద్యుత్ కాంతుల వెలుగుల్లో మండలపర్రు పంచాయతన క్షేత్రం


మండలపర్రు పంచాయతన క్షేత్రంలో శివుడి విగ్రహం


భీమడోలులోని పార్వతీసమేత భీమేశ్వర స్వామి

భీమడోలు: కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు వాడవాడలా శివాలయాలు ముస్తాబయ్యాయి. దీపావళి అనంతరం కార్తీక దీపోత్సవాలు ప్రారంభించాల్సి ఉండగా శనివారం అమావాస్య ఘడియలు ఉండడంతో ఆదివారం నుంచి కార్తీక పూజలు నిర్వహించేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. శివనామస్మరణతో ఆధ్యాత్మిక చింతనతో భక్తులు పరవించనున్నారు. విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. ఆలయాల్లో ఆకాశ దీపం వెలిగించారు. శివునికి ప్రీతికరమైన కార్తీక సోమవారాల్లో ఆలయాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలు సిద్ధంగా చేశారు. శివ భక్తులు పవిత్ర గోదావరి కాలువలో స్నానాలు ఆచరించి శివారాధన, దీపారాధనలతో వారు పరవశిస్తారు. శివాలయం, ఇంటి పెరట్లోని తులసి కోట వద్ద దీపాలను వెలిగిస్తే జన్మజన్మల పాపాలు తొలగిపోయి పుణ్యం దక్కుతుందని వేదపండితులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో దీపారాధనతో శుభం చేకూరుతుందని కార్తీక పురాణం చెబుతుందని వారు పేర్కొన్నారు. మండలం పరిధిలో ప్రాచీన ఆలయాలుగా పేరొందిన భీమడోలు, పోలసానిపల్లి, అంబర్‌పేట, గుండుగొలను, పూళ్ల శివాలయాలు స్వామి, అమ్మవార్లు స్వయంభువుగా వెలిసి భక్తుల కొంగుబంగారమై నిత్యం స్వామివారు పూజలందుకున్నారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర ఆలయం, అంబర్‌పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశారు. భీమడోలు శివాలయాన్ని దేవస్థానం నిధులు, దాతల ఆర్థిక సాయంతో అభివృద్ధి చేశారు. ఇక్కడ కార్తీక ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అంబర్‌పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని దేవస్థానం నిధులతో అభివృద్ధి చేశారు. పోలసానిపల్లి, గుండుగొలను, పూళ్ల శివాలయాల్లో పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

పంచాయతన క్షేత్రం ముస్తాబు

నిడమర్రు: కార్తీక మాసం పురస్కరించుకుని మండలపర్రులోని ఉమానీలకంఠేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు రుద్రాభిషేకంతో ప్రత్యేక అభిషేకాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు పదివేల ఒత్తులతో దీపారాధన ఉంటుందన్నారు. ప్రతి సోమ, శుక్రవారాల్లో కాశీ నుంచి వచ్చిన గురువులతో గంగా, గోదావరి నదులకు ప్రత్యేక హారతులు ఉంటాయన్నారు. కార్తీక పౌర్ణమితోపాటు ప్రతి సోమవారం 8 వేల మంది భక్తులు అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. ఉపవాస భక్తులకు ప్రత్యేక ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పంచాయతన క్షేత్రంలోని ఆలయాలకు అలంకరించిన విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండలంలోని బువ్వనపల్లి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, పెదనింద్రకొలనులోని స్వయంభూ పార్వతీ సమేత భీమేశ్వరస్వామి, బావాయిపాలెం, పత్తేపురంలోని శివాలయాల్లో కార్తీక మాసం సందర్భంగా శనివారం నుంచి ప్రత్యేక అభిషేకాలు, దీపోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఏక్తా దివస్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న కళాశాల బాలికలు

ఏలూరు రూరల్: సర్దార్ వల్లభాయ్‌పటేల్ పుట్టిన రోజు సందర్భంగా ఏలూరులో ఏక్తా దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద నుంచి కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్టేడియం గ్యాలరీపై చేరిన పలు కళాశాల, పాఠశాల విద్యార్థులచే ఎంఈవో ఆర్.రంగయ్య దేశ ఐక్యత సాధిస్తామంటూ ప్రమాణం చేయించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్, పీడీ అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వైకేలో పటేల్‌కు నివాళి

స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో అధికారి దూలం కిషోర్ పటేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన పటేల్ హోమ్ మినిస్టర్‌గా తీసుకున్న నిర్ణయాలు దేశాన్ని ఐక్యంగా ఉంచాయని కొనియాడారు.